తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | గురువారం-22 - జనవరి 2026 | సంపుటి : 3 | సంచిక : 234 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# తెలంగాణ రైజింగ్‌తో పెరిగిన అంతర్జాతీయ నమ్మకం

### వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఫాలో అప్ ఫోరం హైదరాబాద్‌లోనే..

### జులైలో నిర్వహణకు గ్లోబల్ లీడర్ల సమ్మతి

### పెట్టుబడుల వేగానికి ఫాలో అప్ ఫోరం అవసరం

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





**దావోస్, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రతి ఏడాది జులై లేదా ఆగస్టులో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. దావోస్‌లో జరిగిన 'జాయిన్ ది రైజ్' కార్యక్రమంలో ఈ ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. పెట్టుబడుల ఒప్పందాలు వేగంగా కార్యరూపం దాల్చేందుకు మధ్యంతర ఫోరం అవసరమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ఏడాది ఆలస్యం కాదు... వేగమే అవసరం**

ప్రస్తుత ప్రపంచ ఆర్థిక పరిస్థితుల్లో పెట్టుబడుల ఒప్పందాలు, వ్యాపార వాణిజ్య నిర్ణయాలకు ఒక సంవత్సరం చాలా ఎక్కువ సమయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందుకే దావోస్ సమావేశాల మధ్యలో హైదరాబాద్‌లో ఫాలోఅప్ ఫోరం నిర్వహించాలని వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రతినిధులకు సూచించారు. ఇలా జరిగితే ఎంవోయూలు త్వరగా ప్రాజెక్టులుగా మారి, పెట్టుబడులు భూమిపై కనిపిస్తాయని వివరించారు.

మిగతా 2లో



## బాచుపల్లిలో 2.30 ఎకరాల పార్కు రక్షణ

- రూ.300 కోట్ల విలువైన ప్రభుత్వ భూమికి హైడ్రా ఫెన్సింగ్
- ఆక్రమణల తొలగింపుతో ఊపిరిపీల్చుకున్న స్థానికులు

2లో

**బాచుపల్లి, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండలంలోని బాచుపల్లి గ్రామంలో ఉన్న 2.30 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. సర్వే నంబర్లు 142, 143, 144లో ఉన్న ఈ భూమిని 2016లో అప్పటి జిల్లా కలెక్టర్ ప్రజల కోసం పార్కుగా

## ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్, కృత్రిమ మేధ రంగాల్లో తెలంగాణకు కొత్త ఊపు

- దావోస్‌లో తెలంగాణ ప్రభుత్వం–బ్లైజ్ సంస్థ అవగాహన ఒప్పందం
- కృత్రిమ మేధ హార్డ్‌వేర్, డేటా సెంటర్లపై ప్రత్యేక దృష్టి
- హైదరాబాద్‌లో పరిశోధన కేంద్ర విస్తరణకు ప్రభుత్వ హామీ

2లో





## ప్రపంచ బ్యూటీ రంగంలో చారిత్రక అడుగు

- హైదరాబాద్‌లో ప్రపంచంలోనే తొలి బ్యూటీ–టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్
- దావోస్‌లో సీఎం–లోరియల్ సీఈవో కీలక భేటీ
- నవంబర్‌లో జీసీసీ ప్రారంభం, తెలంగాణకు గ్లోబల్ గుర్తింపు

2లో

## తెలంగాణలో విమానాల నిర్వహణ, మరమ్మత్తుల కేంద్రం

- సర్గాడ్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వానికి అవగాహన ఒప్పందం
- మూడు నుంచి ఐదు ఏళ్లలో వెయ్యి కోట్ల పెట్టుబడులు
- వరంగల్ లేదా ఆదిలాబాద్‌లో ఎంఆర్వో కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదన

2లో





## సింగరేణి టెండర్లలో కోట్ల బొగ్గు కుంభకోణం

- సైట్ విజిట్ నిబంధన పేరుతో ప్రజాధనం దోపిడీ
- ఆర్ జి - 3 జీఎం కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ధర్నా

**రామగిరి, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు)::** సింగరేణి టెండర్లలో 'సైట్ విజిట్' నిబంధనను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం కోట్ల రూపాయల బొగ్గు కుంభకోణానికి పాల్పడిందని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపించాయి. ప్రజాధనాన్ని పందికొక్కుల్లా మేస్తూ సింగరేణిని కొల్లగొడుతున్న కాంగ్రెస్ నేతల అవినీతిని ఎండగడుతూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో

8లో

## సరూర్‌నగర్ చెరువును పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తాం

- వరద నియంత్రణకు ఉపయోగపడేలా అభివృద్ధి
- ఏడాదిలో పనులు పూర్తి చేస్తాం: హైడ్రా కమిషనర్

2లో



## జీహెచ్ఎంసీ అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష

- శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి – క్లీన్ అండ్ గ్రీన్ సిటీ లక్ష్యం
- పెండింగ్ వర్క్స్, హెచ్‌సిటీ ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టుల పురోగతి పరిశీలన
- మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ నగర అభివృద్ధి, శానిటేషన్ మెరుగుదల లక్ష్యంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరంలోని అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ పనులు, హెచ్‌సిటీ, ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టుల వివిధ దశల్లో ఉన్న పనుల పురోగతిపై విస్తృతంగా చర్చ జరిగింది.

ఈ సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో పాటు అడిషనల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

శానిటేషన్ అంశంపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. హైదరాబాద్‌ను క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన ప్రణాళికల్లో భాగంగా పలువురు ఇంజనీరింగ్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు కేటాయించాలని,

మిగతా 2లో



## ప్రపంచ వారసత్వ కట్టడమైన తాజ్‌మహల్‌కు సీఐఎస్ఎఫ్ కట్టుదిట్ట భద్రత

- లక్షలాది పర్యాటకులకు సురక్షిత సందర్శన
- భారత సాంస్కృతిక వారసత్వానికి రక్షణ కవచం

**ఆగ్రా, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచ అద్భుతాల్లో ఒకటైన తాజ్‌మహల్‌ను సురక్షితంగా కాపాడుతూ, దేశ విదేశాల నుంచి వచ్చే లక్షలాది పర్యాటకులకు భద్రతతో కూడిన సందర్శన అనుభూతిని అందించడంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం కీలక పాత్ర పోషిస్తోంది.

8లో

## ధర్మపురిలో అభివృద్ధి పనులకు శ్రీకారం

- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన
- విద్య, సంక్షేమమే తెలంగాణ భవిష్యత్తు: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**ధర్మపురి, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):**

జగిత్యాల జిల్లాలోని పుణ్యక్షేత్రమైన ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా విద్య, సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

మిగతా 8లో






## ముచ్చర్ల సత్యనారాయణ జయంతి సందర్భంగా నివాళులు

- తెలంగాణ జాగృతి కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల
- ఉద్యమకారుడి సేవలు చిరస్మరణీయం

8లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తెలంగాణ రైజింగ్‌తో పెరిగిన అంతర్జాతీయ నమ్మకం

(మొదటి పేజీ తరువాయి)



హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ద్వారా 5.75 లక్షల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు ఆకర్షించామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. గతంలో ఎంవోయూల కోసం మాత్రమే దావోస్‌కు వచ్చేవాళ్లమని, ఈసారి తెలంగాణ రైజింగ్ విజన్, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పాలసీలను ప్రపంచానికి వివరించేందుకే వచ్చామని చెప్పారు. ఈ విజయమే గ్లోబల్ మద్దతుకు కారణమైందన్నారు.

**24 గంటల నగరంగా హైదరాబాద్ లక్ష్యం**

హైదరాబాద్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లకు ప్రధాన కేంద్రంగా ఎదిగిందని ముఖ్యమంత్రి తెలిపారు. మూసీ నది పునరుజ్జీవనం, రివర్ ఫ్రంట్ అభివృద్ధితో పాటు నైట్ టైమ్ ఎకానమీపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. దేశంలోనే 24 గంటలు పనిచేసే తొలి నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

**భారత్ ఫ్యూచర్ సిటీ, గ్రీన్ అభివృద్ధి**

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇందులో 50 శాతం కంటే ఎక్కువ గ్రీన్ కవర్ ఉండేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. అదే వేదికపై తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలు, తెలంగాణ AI ఇన్నోవేషన్ హబ్ తెలంగాణ నెక్స్ట్‌జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-2030ను ఆవిష్కరించారు.

**గేమ్-చేంజర్ ప్రాజెక్టులకు గ్లోబల్ భాగస్వామ్యం**

సమావేశంలో పాల్గొన్న మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి హైదరాబాద్ మెట్రో విస్తరణ, చెరువులు-కుంటల పునరుజ్జీవనం వంటి కీలక ప్రాజెక్టులను వివరించారు. క్యూర్, ప్యూర్, రేర్ ఆర్థిక వృద్ధి జోన్ల ప్రణాళికలను ప్రస్తావిస్తూ, తెలంగాణలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయని చెప్పారు.

**చిరంజీవి హాజరుతో ప్రత్యేక ఆకర్షణ**

ఈ కార్యక్రమంలో ప్రముఖ నటుడు చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో కలిసి వారు విందులో పాల్గొని గ్లోబల్ ప్రతినిధులతో మమేకమయ్యారు. ఈ భేటీ తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకొచ్చిందని పలువురు అభిప్రాయపడ్డారు.

# ప్రపంచ బ్యూటీ రంగంలో చారిత్రక అడుగు

హైదరాబాద్, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):




ప్రపంచ బ్యూటీ రంగంలో అగ్రస్థానంలో ఉన్న లోరియల్ సంస్థ, ప్రపంచంలోనే తొలి బ్యూటీ-టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించనున్న ఈ కేంద్రాన్ని ఈ ఏడాది నవంబర్‌లో ప్రారంభించనున్నారు. గ్లోబల్ ఇన్నోవేషన్, టెక్నాలజీ, డేటా నిర్వహణ, సరఫరా వ్యవస్థల కార్యకలాపాలకు హైదరాబాద్‌ను ప్రధాన కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా ఈ జీసీసీ పనిచేయనుంది.

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక- 2026 సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో లోరియల్ సంస్థ సీఈవో నికోలస్ హియెరోనిమస్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులతో బ్యూటీ-టెక్ జీసీసీ ఏర్పాటు చేసే నిర్ణయాన్ని సంస్థ వెల్లడించింది. ఈ కేంద్రం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న లోరియల్ యూనిట్లకు డిజిటల్ మార్పు, కృత్రిమ మేధ, విశ్లేషణ రంగాల్లో రూపొందించే సాంకేతిక పరిష్కారాలను అందించనున్నారు.

ఈ జీసీసీ ఏర్పాటుతో గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్ కార్యకలాపాల్లో హైదరాబాద్ ప్రాధాన్యం మరింత పెరుగుతుందని లోరియల్ సీఈవో తెలిపారు. డేటా ఆధారిత నిర్ణయాలు, కృత్రిమ మేధ ఆధారిత వినూత్న పరిష్కారాలు, ఆధునిక సరఫరా వ్యవస్థల నిర్వహణలో హైదరాబాద్ కీలక పాత్ర పోషించనుందని చెప్పారు. నవంబర్‌లో జరగనున్న జీసీసీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి, ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును లోరియల్ సంస్థ ఆహ్వానించింది.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, లోరియల్ జీసీసీని హైదరాబాద్‌కు తీసుకురావాలన్న ఆలోచనపై ముఖ్యమంత్రి ప్రత్యేక ఆసక్తి చూపారని తెలిపారు. ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మెడ్‌టెక్, హెల్త్‌టెక్‌తో పాటు బ్యూటీ-టెక్ వంటి కొత్త రంగాల్లోనూ తెలంగాణ ముందంజలో ఉందన్నారు. ఇప్పటికే అనేక గ్లోబల్ సంస్థలు హైదరాబాద్‌లో తమ జీసీసీలను ఏర్పాటు చేశాయని గుర్తుచేశారు. తెలంగాణ కృత్రిమ మేధ ఇన్నోవేషన్ హబ్ సామర్థ్యాలను రాష్ట్ర ప్రతినిధి బృందం వివరించగా, భవిష్యత్తులో మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు అవకాశాలపై కూడా లోరియల్ సంస్థ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



# ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్, కృత్రిమ మేధ రంగాల్లో తెలంగాణకు కొత్త ఊపు

ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్, కృత్రిమ మేధ రంగాల్లో చేపడుతున్న కార్యక్రమాలను మరింత వేగవంతం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు సందర్భంగా కాలిఫోర్నియాకు చెందిన బ్లైజ్ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. తక్కువ శక్తి వినియోగంతో పనిచేసే కృత్రిమ మేధ హార్డ్‌వేర్, సంపూర్ణ సాఫ్ట్‌వేర్ వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో బ్లైజ్ సంస్థ ప్రత్యేకత కలిగి ఉంది.

ఈ సదస్సులో బ్లైజ్ సంస్థ సహ వ్యవస్థాపకుడు, ప్రధాన కార్యనిర్వాహక అధికారి దినాకర్ మునగాలా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో జరిగిన విస్తృత చర్చల అనంతరం ఇరు పక్షాల మధ్య అధికారికంగా ఒప్పందం కుదిరింది. డేటా సెంటర్లకు అవసరమైన కృత్రిమ మేధ కంప్యూటింగ్ పరిష్కారాల్లో తెలంగాణ కీలక పాత్ర పోషించేలా ఈ భాగస్వామ్యం దోహదపడనుంది.

ఇప్పటికే బ్లైజ్ సంస్థ హైదరాబాద్‌లో పరిశోధన, అభివృద్ధి, ఇంజినీరింగ్ కేంద్రాన్ని నిర్వహిస్తోంది. ఈ కేంద్రాన్ని మరింత విస్తరించాలనే ఆలోచనలో సంస్థ ఉందని ప్రతినిధులు వెల్లడించారు. ఆరోగ్య నిర్ధారణ సేవలు, తయారీ రంగ ఆటోమేషన్, శక్తి సామర్థ్యం వంటి విభాగాల్లో కృత్రిమ మేధ ఆధారిత పరిష్కారాలను ప్రయోగాత్మక ప్రాజెక్టులుగా అమలు చేసే అవకాశాలపై కూడా ఈ సమావేశంలో చర్చ జరిగింది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణను కృత్రిమ మేధ డేటా సెంటర్ కేంద్రంగా తీర్చిదిద్దడం రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమని అన్నారు. రాబోయే రెండు దశాబ్దాల్లో మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యాన్ని సాధించాలంటే కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, క్వాంటం కంప్యూటింగ్, హార్డ్‌వేర్, ఆటోమేషన్ రంగాల్లో వేగంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. బ్లైజ్ సంస్థ హైదరాబాద్ పరిశోధన కేంద్ర విస్తరణకు ప్రభుత్వం పూర్తి మద్దతు అందిస్తుందని హామీ ఇచ్చారు.

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో తెలంగాణ కృత్రిమ మేధ ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కృత్రిమ మేధ రంగంలో పెట్టుబడులు, పరిశోధనలు, ఆవిష్కరణలకు ఇది వ్యూహాత్మక కేంద్రంగా పని చేస్తుందని చెప్పారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి కృత్రిమ మేధ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# సరూర్‌నగర్ చెరువును పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తాం



హైదరాబాద్, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):

సరూర్‌నగర్ చెరువును పూర్తిస్థాయిలో పునరుద్ధరించి, వరద నియంత్రణకు ఉపయోగపడేలా అభివృద్ధి చేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. ప్రభుత్వ అనుమతులు పొందిన వెంటనే పనులు ప్రారంభిస్తామని, మార్చి నెలలోగా పనులకు శ్రీకారం చుడతామని తెలిపారు. బుధవారం సరూర్‌నగర్ చెరువును క్షేత్ర స్థాయిలో పరిశీలించిన ఆయన, చెరువు అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు.

సుమారు 140 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న సరూర్‌నగర్ చెరువు పరిధిలో ఇప్పటికే అనేక నివాసాలు ఏర్పడ్డాయని, ప్రస్తుతం వాటి జోలికి వెళ్లే ఉద్దేశం లేదని హైడ్రా కమిషనర్ స్పష్టం చేశారు. చెరువులో మిగిలి ఉన్న 90 ఎకరాలకు పైగా విస్తీర్ణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. నగరంలోని పెద్ద చెరువుల అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన సూచనల మేరకే ఈ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

చెరువుల అభివృద్ధి అంటే కేవలం పైపై మెరుగులు దిద్దడమే కాదని, ఇప్పటికే హైడ్రా పునరుద్ధరించిన బతుకమ్మకుంట, బంరుకున్-ఉద్-దౌలా, కూకట్‌పల్లి నల్లచెరువు ప్రాంతాలను పరిశీలిస్తే అది స్పష్టమవుతుందని రంగనాథ్ అన్నారు. సరూర్‌నగర్ చెరువులో 10 నుంచి 15 అడుగుల లోతు వరకు పూడికను తొలగించి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతామని తెలిపారు. దీని వల్ల భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు వరదల నియంత్రణకు చెరువు కీలకంగా మారుతుందన్నారు. చెరువు ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పర్యావరణ హితంగా చెరువు పరిసరాల్లో ఔషధ గుణాలు కలిగిన మొక్కలను విస్తృతంగా నాటడం, ఇప్పటికే ఉన్న ఇందిరా ప్రియదర్శిని పార్కుతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో కొత్త పార్కుల అభివృద్ధి చేపడతామని హైడ్రా కమిషనర్ తెలిపారు. చెరువు చుట్టూ బండ్, వాకింగ్ ట్రాక్‌లు, చిన్నారుల కోసం క్రీడా పార్కులు, అన్ని వయసుల వారికి ఉపయోగపడే ఓపెన్ జిమ్‌లు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. మురుగు నీరు చెరువులో కలవకుండా వాటర్ బోర్డు సహకారంతో చర్యలు తీసుకుంటామని, ఎస్‌టీపీల సామర్థ్యాన్ని కూడా పెంచుతామని పేర్కొన్నారు.

హైడ్రా కమిషనర్ సరూర్‌నగర్ చెరువును సందర్శించడంపై లింగోజిగూడ, గడ్డి అన్నారం కార్పొరేటర్లు దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. హైడ్రా చేపట్టే పనులతో చెరువు సర్వాంగ సుందరంగా మారుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్‌ను శాలువాలతో సత్కరించారు. పర్యటనలో హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, ఏసీపీ తిరుమల్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# జీహెచ్ఎంసీ అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

వారి కార్యచరణపై నిరంతర సమీక్ష జరపాలని సూచించారు. చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ, డ్రెయినేజ్ సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో ఆలస్యం లేకుండా టైమ్‌లైన్‌లతో ముందుకు వెళ్లాలని, పెండింగ్ వర్క్‌స్‌ను ప్రాధాన్యతగా పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. నగర ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆదేశిస్తూ, ప్రాజెక్టుల పురోగతిపై తరచూ సమీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

# బాచుపల్లిలో 2.30 ఎకరాల పార్కు రక్షణ

బాచుపల్లి, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండలంలోని బాచుపల్లి గ్రామంలో ఉన్న 2.30 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. సర్వే నంబర్లు 142, 143, 144లో ఉన్న ఈ భూమిని 2016లో అప్పటి జిల్లా కలెక్టర్ ప్రజల కోసం పార్కుగా కేటాయించారు. ఆ మేరకు మొక్కలు నాటి పార్కును అభివృద్ధి చేయడంతో పాటు అర్బన్ నర్సరీని ఏర్పాటు చేసి పచ్చదనాన్ని పెంచారు.




పార్కు అభివృద్ధిలో భాగంగా బోర్‌వెల్, వాటర్ సంప్, వాచ్‌మన్ గది, ఇనుప గేట్లు, ఫెన్సింగ్ వంటి మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేశారు. అయితే 2023లో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ఈ పార్కులోని మొక్కలను ధ్వంసం చేసి నర్సరీని తొలగించారు. తమదే భూమి అంటూ రాత్రికి రాత్రి ప్రహరీ నిర్మించి ఆక్రమణలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల ఆధారంగా క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో కలిసి హైడ్రా పరిశీలన చేపట్టింది. పరిశీలనలో ఇది పార్కు స్థలమేనని స్పష్టంగా నిర్ధారణకు వచ్చింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు మంగళవారం ఆక్రమణలను తొలగించి, పార్కు స్థలానికి తిరిగి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిగా సూచిస్తూ హైడ్రా బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. అదే సర్వే నంబర్లలో ఎమ్మార్వో కార్యాలయానికి కేటాయించిన 30 గుంటల ప్రభుత్వ భూమి కూడా ఆక్రమణలకు గురికావడంతో, అక్కడ కూడా హైడ్రా చర్యలు చేపట్టింది. ఆక్రమణలను పూర్తిగా తొలగించి 30 గుంటల భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. పార్కు స్థలం, ప్రభుత్వ భూమి రెండింటినీ కాపాడినందుకు బాచుపల్లి నివాసితులు హైడ్రాకు కృతజ్ఞతలు తెలిపారు. హైడ్రా, ప్రభుత్వానికి మద్దతుగా నినాదాలు చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు.



# తెలంగాణలో విమానాల నిర్వహణ, మరమ్మత్తుల కేంద్రం

దావోస్, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):

అమెరికాకు చెందిన సర్గాడ్ సంస్థ తెలంగాణలో విమానాల నిర్వహణ, మరమ్మత్తులు, పునరుద్ధరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. రాబోయే మూడు నుంచి ఐదు సంవత్సరాల్లో దశలవారీగా వెయ్యి కోట్ల రూపాయల వరకు పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ కేంద్రం ద్వారా రాష్ట్రంలో ఏరోస్పేస్ రంగానికి కొత్త ఊపు రావాలని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో భాగంగా దావోస్‌లో సర్గాడ్ సంస్థ వ్యవస్థాపకుడు, ప్రధాన కార్యనిర్వాహక అధికారి శ్రీనివాస్ తోట ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు పక్షాలు పెట్టుబడులు, మౌలిక వసతులు, భవిష్యత్ అవకాశాలపై విస్తృతంగా చర్చించి ఒప్పందానికి వచ్చాయి. ఏరోస్పేస్, రక్షణ, ఆటోమొబైల్, ఆధునిక తయారీ రంగాల్లో సర్గాడ్ సంస్థకు ఉన్న అనుభవాన్ని తెలంగాణలో వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణను మూడు ప్రత్యేక అభివృద్ధి ప్రాంతాలుగా రూపొందిస్తున్నట్లు వివరించారు. సేవల రంగానికి కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ, తయారీ రంగానికి పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ, వ్యవసాయం మరియు గ్రీన్ ఎకానమీకి రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ విధానంతో సమతుల్యమైన ప్రాంతీయ అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు.

వరంగల్, ఆదిలాబాద్‌లలో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తున్నామని, ఈ ప్రాంతాల్లో ఏదైనా ఒక చోట విమానాల నిర్వహణ-మరమ్మత్తుల కేంద్రం ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. వరంగల్, ఆదిలాబాద్ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి అత్యధిక ప్రోత్సాహకాలు అందిస్తామని సర్గాడ్ సంస్థకు హామీ ఇచ్చారు. ఈ పెట్టుబడులు అక్కడి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టుతో తెలంగాణలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పరికరాల తయారీ రంగంలో కొత్త అవకాశాలు ఏర్పడతాయని అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
గురువారం - 22 - జనవరి 2026


# రోడ్డు భద్రతపై అవగాహన పోటీలు.!






- విజేతలకు బహుమతులు.

**సత్తుపల్లి, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):** రోడ్డు భద్రత పట్ల సమాజంలోని ప్రతి ఒక్కరికి అవగాహన ఉండటం అత్యంత అవసరమని సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి అన్నారు. చిన్న వయసు నుంచే రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తే ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని వారు పేర్కొన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా (జనవరి 1 నుంచి 31 వరకు) సత్తుపల్లి ఆర్టీసీ ఆధ్వర్యంలో స్థానిక విశ్వశాంతి పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రోడ్డు భద్రత, వాహన నిబంధనలు, ప్రమాదాల నివారణ వంటి అంశాలపై ఈ పోటీలు నిర్వహించగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు కార్యక్రమానికి అతిథులుగా హాజరైన అధికారులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బహుమతులు పొందిన విశ్వశాంతి విద్యార్థుల్లో కౌషర్, నాగ వర్షిని, రితిక ఉన్నారు. విజేతలను అధికారులు అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని తెలిపారు.
అనంతరం వారు మాట్లాడుతూ, వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సరైన లైసెన్స్ లేకుండా వాహనం నడపకూడదని సూచించారు. అలాగే సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం ప్రాణాపాయకరమని, అతివేగం మరియు అజాగ్రత్త వలన అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా మాత్రమే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

## ప్రమాద రహిత సేవలందించిన డ్రైవర్లకు సన్మానం



- నియమాలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ.
- అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి.

**సత్తుపల్లి, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):** రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, భద్రతా నియమాలను విధిగా పాటిస్తూ డ్రైవింగ్ చేయాలని సత్తుపల్లి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ (ఏఎంవీఐ) రాజశేఖర్ రెడ్డి అన్నారు.
బుధవారం సత్తుపల్లి ఆర్టీసీ డిపో గ్యారేజీలో డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీ నారాయణ అధ్యక్షతన నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో ట్రాఫిక్ నియమాలు కచ్చితంగా పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని స్పష్టం చేశారు. రోడ్డు భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం ప్రమాదాలకు దారితీస్తుందని, దీనిని పూర్తిగా మానుకోవాలని సూచించారు. ప్రమాదాల నివారణలో డ్రైవర్ పాత్ర అత్యంత కీలకమని, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు అప్రమత్తతతో వాహనాలు నడపాలని డ్రైవర్లకు సూచించారు. శిక్షణ పొందిన అనుభవజ్ఞులైన డ్రైవర్లు ఆర్టీసీలో ఉండటం వల్ల ప్రమాదాలు గణనీయంగా తగ్గుతున్నాయని అన్నారు.
ప్రభుత్వ వైద్యాధికారి కారెం పూజ మాట్లాడుతూ డ్రైవర్లు అప్రమత్తంగా డ్రైవింగ్ చేయడంతో పాటు ప్రతి ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా సత్తుపల్లి డిపోలో ఉత్తమ ప్రమాద రహిత సేవలు అందించిన డ్రైవర్లు ఏబీ గఫార్, వి.కె.చారి, జి.శంకర్‌లకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే మెకానిక్‌లు సిహెచ్. కే.చారి, ఏ.మహేంద్రలను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి.ప్రవీణ్ కుమార్, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ సిలివేరి సాహితీ, ఏఎంవీఐ రాజశేఖర్ రెడ్డి, ప్రభుత్వ వైద్యాధికారి కారెం పూజ, డిపో ఉద్యోగులు, ఏడీసీలు తదితరులు పాల్గొన్నారు.





# మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం

- ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**మేడ్చల్, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, మేడ్చల్ నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ గెలిపించి ముఖ్యమంత్రికి కానుకగా అందిస్తామని రాష్ట్ర మంత్రి, మేడ్చల్ జిల్లా మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జ్ కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం అలియాబాద్ మున్సిపాలిటీలోని శుభం గార్డెన్‌లో మూడుచింతలపల్లి, అలియాబాద్, ఎల్లంపేట్ మున్సిపాలిటీలకు సంబంధించిన కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సంవత్సరాల కాలంలో అనేక ప్రజా సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసిందని తెలిపారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, ముఖ్యమంత్రి సహాయ నిధి, గృహజ్యోతి పథకం, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల పథకం వంటి సంక్షేమ కార్యక్రమాలతో పాటు మున్సిపాలిటీల్లో కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. ఈ సంక్షేమ పాలనను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చి ఈ ప్రాంతాన్ని దోచుకున్న దోపిడీదారులకు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ధనబలంతో ఓటర్లను మభ్యపెట్టే పగటి వేషధారులను ప్రజలు తిరస్కరించాలని ఆయన కోరారు. మూడు మున్సిపాలిటీల్లో మెజారిటీ వార్డులను కైవసం చేసుకుని చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్, జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ శరత్ చంద్ర రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పిసర మైపాల్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డాక్టర్ జిల్లెల మాధవరెడ్డి జ్ఞాపకార్థం ఫుట్ బాల్ టోర్నమెంట్ విజయవంతం



- విజేత జట్టుకు నగదు బహుమతులు అందజేత

**వనపర్తి,జనవరి21(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా కేంద్ర పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ప్రజా డాక్టర్ జిల్లెల మాధవరెడ్డి స్మారక ఫుట్ బాల్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌ను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఏఐపిసి అధ్యక్షులు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి నిర్వహించారు. టోర్నమెంట్‌లో మొత్తం 12 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌కు వనపర్తి జట్టు, ఏజీ హైదరాబాద్ జట్లు చేరగా, హోరాహోరీగా సాగిన పోరులో ఏజీ హైదరాబాద్ జట్టు 2-0 గోల్స్ తేడాతో విజయం సాధించింది. విజేత ఏజీ హైదరాబాద్ జట్టుకు రూ. 50,000/ నగదు షీల్డ్‌ను డాక్టర్ చిన్నారెడ్డి, డాక్టర్ ఆదిత్య రెడ్డి అందజేశారు. రన్నర్ అప్గ్రేడ్ అయిన వనపర్తి జట్టుకు రూ. 30,000/ నగదు షీల్డ్ అందజేశారు. మూడవ స్థానం సాధించిన గ్లోబ్ హైదరాబాద్ జట్టుకు రూ. 20,000/ నగదు షీల్డ్, నాల్గవ స్థానం సాధించిన హుబ్లీ జట్టుకు రూ. 10,000/ నగదు షీల్డ్‌ను కూడా వీరే అందజేశారు. డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ...ఆసియా ప్రాంతంలో క్రికెట్‌కు ఎక్కువ ఆదరణ ఉన్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన ఫుట్ బాల్ ఆటను వనపర్తి జిల్లా నుంచి భారత జట్టుకు ఆడించాలని ప్రయత్నం చేయడమే డాక్టర్ జిల్లెల మాధవరెడ్డి స్మారక ఫుట్ బాల్ టోర్నమెంట్ నిర్వహణలో ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు.ఆయన కొడుకులు ఆదిత్య రెడ్డి, అనురాగ్ రెడ్డి ఫుట్ బాల్‌ను ఎంతో ఇష్టపడతారని, టీవీలో ఎక్కువగా ఫుట్ బాల్ మ్యాచ్‌లను వీరిద్దరూ చూసి ఆనందిస్తారని తెలిపారు.టోర్నమెంట్ విజయవంతంగా ముగిసిన క్రీడా జట్లకు శుభాకాంక్షలు తెలిపారు.డాక్టర్ ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ...ఆటలకు కులమత బేధాలు లేకుండా పట్టుదలతో సాధన చేస్తారో వారు విజయం సాధిస్తారని, మైదానంలోకి దిగిన తర్వాత ప్రపంచాన్ని మరిచిపోయి ఆడితే ప్రపంచమే క్రీడాకారుల వైపు చూస్తుందని తెలిపారు.ఓటమి కూడా ఆటలో భాగమని, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకొని విజయం సాధించాలని క్రీడాకారులను ఉత్సహపరిచారు. మన ప్రాంతానికి గుర్తింపు తెచ్చేందుకు క్రమశిక్షణతో సాధన చేయాలని సూచించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# పదకొండు గ్రామాల ఏకాభిప్రాయంతో ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా సందీప్

**ఎల్కతుర్తి, జనవరి 21: (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలంలోని పదకొండు గ్రామాలకు చెందిన ఉపసర్పంచులు ఏకాభిప్రాయంతో దండపల్లి గ్రామానికి చెందిన శనిగరపు సందీప్ ను ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నిక చేశారు. బుధవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో జరిగిన సమావేశానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి అధ్యక్షత వహించగా, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుకిన సంతాజి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు పుల్లూరి శ్రీధర్ రావు ఆధ్వర్యంలో ఉపసర్పంచుల ఫోరం కమిటీని ఏర్పాటు చేశారు.
ఈ సమావేశంలో మండలంలోని పదకొండు గ్రామాల ఉపసర్పంచులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో గోపాల్‌పూర్ గ్రామ ఉపసర్పంచ్ మారుపాక సందీప్ ను ఉపాధ్యక్షుడిగా, బాబుపేట గ్రామానికి చెందిన మేకల బాబును గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఉపసర్పంచుల మధ్య సమన్వయం పెంపొందించడం, స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం లక్ష్యంగా ఫోరం పనిచేస్తుందని నిర్వాహకులు తెలిపారు.
నూతన అధ్యక్షుడు శనిగరపు సందీప్ మాట్లాడుతూ, తనను ఎన్నుకున్నందుకు ఉపసర్పంచులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఫోరం ద్వారా ఉపసర్పంచుల సమస్యల పరిష్కారం, గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# జె.జె. నగర్‌లో రూ.1.36 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభం



**నేరేడ్‌మెట్, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):** నేరేడ్‌మెట్ డివిజన్‌లోని జె.జె. నగర్ రోడ్ నెం.6లో రూ.18 లక్షల కార్పొరేటర్ నిధులతో చేపట్టనున్న రోడ్డు అభివృద్ధి పనులను కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం జె.జె. నగర్ మెయిన్ రోడ్ నుంచి సైనిక్‌పురి మెయిన్ రోడ్ వరకు రూ.1.18 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆర్‌సీసీ వర్షపు నీటి నిల్వ నివారణ కాలువ (డ్రెయినేజ్ లైన్) పనులను కూడా ప్రారంభించారు. వర్షాకాలంలో ప్రతి ఏడాది ఈ ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉండటంతో వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్న పరిస్థితి ఉండేదని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం అందించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు కార్పొరేటర్ తెలిపారు.గతంలోనే ఈ డ్రెయినేజ్ కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించగా, అవి మంజూరు కావడంతో ప్రస్తుతం పనులు ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఆదిత్య, రమేష్ గౌడ్, సత్యనారాయణ, శర్మ, పరాస్ జైన్, రాజి రెడ్డి, రఘురాం రెడ్డి, మోహన్, శ్యామ్, దినేష్, నాగరాజు, అకారం సాయి, అగర్వాల్, నవీన్, శాంతా రావు, ధనలక్ష్మి, ప్రమీల, ఇంద్రమ్మ, పద్మజ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. స్థానికులు అభివృద్ధి పనులు ప్రారంభించినందుకు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సురక్షితంగా చేరుకుందాం – రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం





**– పెద్దమందడి ఎస్సై జలంధర్ రెడ్డి**

**పెద్దమందడి,జనవరి21(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలో ఎస్సై జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనీ, ఫోర్ వీలర్ వాహనదారులు సీటుబెల్ట్ వినియోగించాల్సిందేనని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక వేగంతో డ్రైవింగ్ చేయడం, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగించడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఈ మధ్యకాలంలో రోడ్డు ప్రమాదంలో తన కొడుకును కోల్పోయిన ఓ తల్లి తన ఆవేదనను మీడియాకు వెల్లడిస్తూ, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ఎన్నో కుటుంబాలు కాపాడబడతాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితి మరొకరికి రాకూడదని, అందరూ కూడా రోడ్డుపై జాగ్రత్తలు పాటించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని ఆ తల్లి వేడుకొంది.ఈ అవగాహన కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రామాలయంలో ఘనంగా తొమ్మిదవ వార్షికోత్సవం





**ఖమ్మం బ్యూరో, జనవరి 22 (తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగిలిగొండ గ్రామంలో శ్రీశ్రీశ్రీ సీతారామచంద్రస్వామి 9వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ చైర్మన్ పదిమల వెంకట నరసయ్య, వైస్ చైర్మన్ గడ్డం రామారావు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ సీతారామచంద్రస్వామి దేవాలయం ఎనిమిదవ సంవత్సరాలు పూర్తి చేసుకుని 9వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా ఘనంగా వార్షికోత్సవం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించామని వారు తెలిపారు. ఉదయం 6 గంటలకు మంగళ వాయిద్యాలతో పుష్ప అలంకరణ కార్యక్రమాలు చేశారు. ఉదయం ఏడు గంటల 30 నిమిషాలకు స్వామివారికి పాల అభిషేకాలు చేశారు. ఉదయం 9 గంటలకు శిఖర చక్రస్థానం అభిషేకం, గుడి పైన అభిషేకం చేశారు. 11 గంటలకు హోమం తదనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో సుమారు భక్తులు 2000 మంది తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ మండలి, ఆలయ అర్చకులు.. గ్రామ పెద్దలు , గ్రామ ప్రజలు, భక్త మహాశయులు తదితరులు పాల్గొన్నారు

# అరైవ్ అలైవ్-2026పై విస్తృత అవగాహన కార్యక్రమం





- **రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం : కీసర పోలీసులు**

**కీసర, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మక "అరైవ్ అలైవ్-2026" ప్రాజెక్టు మరియు రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి మార్గదర్శకత్వంలో, రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచే లక్ష్యంతో కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కీసర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో, బండ్లగూడ ఎక్స్ రోడ్ వద్ద ఎస్ఐలు నాగరాజు, శ్రీనివాస్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, రోజువారీ వాహనదారులు, పాదచారులు మరియు సాధారణ ప్రజలను లక్ష్యంగా చేసుకుని రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనం నడపకూడదని, హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించకూడదని, అతివేగం మరియు నిర్లక్ష్య డ్రైవింగ్ ప్రమాదకరమని పోలీసులు వివరించారు. అలాగే పాదచారుల భద్రత అందరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చని తెలిపారు. రోడ్డు భద్రతపై పోస్టర్లు, అవగాహన పత్రికలను ప్రజలకు పంపిణీ చేయడంతో పాటు, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టారు. స్థానిక మీడియా ద్వారా కూడా ఈ కార్యక్రమంపై సమాచారాన్ని ప్రజలకు చేరవేశారు.ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రతి ప్రయాణికుడు సురక్షితంగా గమ్యస్థానానికి చేరాలనే లక్ష్యంతో కీసర పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని అధికారులు తెలిపారు.

# మల్లాపూర్ ఓల్డ్ విలేజ్‌లో సీసీ రోడ్డు పనుల పరిశీలన

- **నూతన ఇంజనీర్లకు అభినందనలు తెలిపిన కాంగ్రెస్ నాయకుడు ఎస్‌వి కిట్టు**



**మల్లాపూర్, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ పరిధిలోని మల్లాపూర్ ఓల్డ్ విలేజ్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎస్‌వి కిట్టు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతి, నిర్మాణ నాణ్యత, ప్రజలకు కలిగే ప్రయోజనాలపై సంబంధిత అధికారులతో సమగ్రంగా చర్చించారు.మల్లాపూర్ ఓల్డ్ విలేజ్‌లో గతంలో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉండటంతో స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఎస్‌వి కిట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే వాహనదారులు, పాదచారుల సమస్యలు తీరనున్నాయని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీరు నిల్వ కాకుండా, దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా నాణ్యమైన పనులు చేపట్టాలని అధికారులను సూచించారు.ఈ సందర్భంగా ఇటీవల నూతన బాధ్యతలు స్వీకరించిన నాచారం సర్కిల్ డిప్యూటీ ఇంజనీర్ ఉమా మహేశ్వరి, అసిస్టెంట్ ఇంజనీర్ సూరజ్‌లను ఎస్‌వి కిట్టు ఘనంగా అభినందించారు.ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, అభివృద్ధి పనుల్లో పారదర్శకతతో పాటు నాణ్యతను తప్పనిసరిగా పాటించాలని కోరారు.ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఎస్‌వి కిట్టు, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వంటి అంశాలపై ఎప్పటికప్పుడు అధికారులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు మద్ బబ్బాయి, యాది రెడ్డి, రమేశ్ నాయక్, సాయి కుమార్ గౌడ్, వెంకటేష్, రాంప్రసాద్, అన్వర్, బికసపతి, గణేష్‌గౌడ్‌లతో పాటు పార్టీ కార్యకర్తలు, మల్లాపూర్ ప్రాంత ప్రజలు పాల్గొని తమ సమస్యలను ఎస్‌వి కిట్టు దృష్టికి తీసుకువచ్చారు.

# రాజగారి బంగ్లా పునరుద్ధరణకు రూ.10 కోట్లు మంజూరు

- **మొత్తం రూ.23 కోట్ల 15 లక్షల నిధులు సాధించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**వనపర్తి,జనవరి21(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా కీర్తి ప్రతీకగా నిలిచిన చారిత్రక రాజగారి బంగ్లా (రాజ మహల్) పునరుద్ధరణకు తెలంగాణ ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసింది.అలాగే బంగ్లాలో కొనసాగుతున్న పాలిటెక్నిక్ కళాశాల బాలురు, బాలికల వసతి గృహాల పునరుద్ధరణకు ఇటీవల రూ.13 కోట్ల 15 లక్షల నిధులు మంజూరు కావడంతో మొత్తం రూ.23 కోట్ల 15 లక్షలు వనపర్తికి లభించాయి.140 సంవత్సరాలకు పైగా చారిత్రక ప్రాముఖ్యత కలిగిన రాజగారి బంగ్లా శిథిలావస్థకు చేరుకుంటున్నదని గుర్తించిన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించారు. రాజుగారి బంగ్లా వనపర్తి చరిత్రకు ప్రతీకగా నిలిచిన కట్టడమని భావించిన ఆయన, మొదటి నుంచి దీని సంరక్షణకు కృషి చేశారు. బంగ్లా పునరుద్ధరణకు అవసరమైన అంశాలపై నిపుణులతో సమగ్ర పరిశీలన జరిపించి, నివేదికలను తయారు చేసి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి సమర్పించారు.దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి ముందుగా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల వసతి సమస్యల పరిష్కారానికి రూ.13 కోట్ల 15 లక్షల నిధులు మంజూరు చేయగా, తాజాగా రాజగారి బంగ్లా పునరుద్ధరణకు రూ.10 కోట్ల నిధులు విడుదల చేశారని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వనపర్తి చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచిన రాజగారి బంగ్లాను కాపాడుకునేందుకు ఎమ్మెల్యే చేసిన కృషిని జిల్లా పరిధిలోని విద్యావేత్తలు, సంఘసంస్కర్తలు, సాహితీవేత్తలు, కళాకారులు, నిపుణులు, ప్రజలు ప్రశంసించారు.

# ఖమ్మంలో టిబిజెఏ కమిటీ సమావేశం



**ఖమ్మం బ్యూరో, జనవరి 20(తెలంగాణ ముచ్చట్లు):** టిడబ్ల్యూజేఎఫ్ అనుసంధానంతో తెలంగాణ బ్రాడ్ కాస్టింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టిబిజెఏ) ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కమిటీ సమావేశం జిల్లా పట్టణ కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశంలో టిబిజెఏ ఖమ్మం జిల్లా నూతన కమిటీని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వందనపు సామ్రాట్ గుప్తా, పట్టణ అధ్యక్షులు ఎలుగోటి వెంకటలు కలిసి, జిల్లా కోశాధికారిగా కే. శ్రీధర్, పట్టణ ఉపాధ్యక్షులుగా ఎన్. రాకేష్, షేక్ సోందుమియా, సహాయ కార్యదర్శిగా సి.హెచ్. రాంబాబులను ఏకగ్రీవంగా నియమించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు సంతోష్ చక్రవర్తి, జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా కోశాధికారి ఆర్వపల్లి నగేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా వీడియో జర్నలిస్టుల జిల్లా అధ్యక్షులు అమరబోయిన ఉపేందర్, జిల్లా కోశాధికారి అర్వపల్లి నగేష్, జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, సహాయ కార్యదర్శి కుంభం రవికుమార్, టీబీజేఏ నగర అధ్యక్షులు వెంకట్, షేక్ మీరా, అలీమ్, రామచందర్, షేక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు



- **రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత**
- **జిల్లా ఎస్పీ సునీత రెడ్డి**

**వనపర్తి,జనవరి21(తెలంగాణ ముచ్చట్లు):** రోడ్డు భద్రత ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు.తెలంగాణ పోలీస్ శాఖ చేపట్టిన అరైవ్ - అలైవ్ అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా ఎస్పీ గారు పెద్దమందడి మండలం వెల్టూర్ సమీపంలో ఉన్న 44వ జాతీయ రహదారిపై ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జాతీయ రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల వల్ల అమూల్యమైన ప్రాణాలు కోల్పోతున్నామని పేర్కొన్నారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరమన్నారు. ప్రమాద ప్రాంతాల్లో వాహనదారులకు ముందస్తు సమాచారం అందేలా సూచిక బోర్డులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజల ప్రాణ రక్షణే లక్ష్యంగా పోలీస్ శాఖ, జాతీయ రహదారుల అథారిటీ, రోడ్డు రవాణా శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి వాహనదారుడు అరైవ్ - అలైవ్ లక్ష్యాన్ని పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిరంతరం నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, రోడ్డు రవాణాశాఖ, జాతీయ రహదారుల అధికారులు, టోల్ ప్లాజా ప్రతినిధులు, వెల్టూర్ దండు నరేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
గురువారం - 22 - జనవరి 2026


## కాకరవాయిలో ఘనంగా మార్కండేయ స్వామి జయంతి వేడుకలు..



**ఖమ్మం బ్యూరో, జనవరి 22(తెలంగాణ ముచ్చట్లు)**: కాకరవాయి గ్రామంలో ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసి నిర్మించుకున్న మార్కండేయ స్వామి ఆలయంలో మార్కండేయ స్వామి జయంతి వేడుకలను పద్మశాలి కులస్తుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకోగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. వేడుకల సందర్భంగా ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి పుష్పాలంకరణ చేసి విశేష నైవేద్యాలను సమర్పించారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో కిటకిటలాడుతూ భక్తి పారవశ్యాన్ని ప్రతిబింబించింది.ఈ సందర్భంగా పద్మశాలి కుల పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ..మార్కండేయ స్వామిని పద్మశాలి ల మూలపురుషుడిగా వర్ణించారు. ధర్మం, కర్మ, శ్రమకు ప్రతీకగా నిలిచిన మార్కండేయ స్వామి ఆశీస్సులతో పద్మశాలి సమాజం తరతరాలుగా అభివృద్ధి పథంలో సాగుతోందని తెలిపారు. సమాజ ఐక్యత, సంస్కృతి పరిరక్షణకు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.అలాగే, ఇటీవల కొత్తగా నిర్మించిన ఈ ఆలయం పద్మశాలి సమాజానికి ఒక ఆధ్యాత్మిక కేంద్రముగా నిలుస్తుందని, భవిష్యత్తు తరాలకు సంస్కారాలు, సంప్రదాయాలను తెలియజేసే మార్గదర్శకంగా ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు. గ్రామస్తుల సహకారంతో ఆలయ నిర్మాణం పూర్తయినందుకు ఆనందం వ్యక్తం చేశారు. మార్కండేయ స్వామి కృపతో గ్రామం సుభిక్షంగా, శాంతియుతంగా, సౌభాగ్యంగా ఉండాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గూడూరు ఉపేందర్,చేనేత సొసైటీ,చైర్మన్ గూడూరు శ్రీనివాస్, దేవాదాయ కమిటీ సభ్యులు దాసరి జనార్ధన్,కొంగర సంగయ్య,గుండా గోవర్ధన్,పెనుగొండ ఉప్పాలయ్య,చెన్నా సోమయ్య, వార్డు సభ్యులు గుండా ఆంజనేయులు ,దాసరి రవి,కొంగరి రాజేష్,కొంగర వేణు,దీకొండ నాగభూషణం, జెల్ల లక్ష్మీకాంతం,పెనుగొండ ఉప్పలయ్య, గూడూరు ఉపేందర్, జెల్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు..

## ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఎం ధ్యేయం



- **మున్సిపల్ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థుల గెలుపుకు కార్యకర్తలు కృషి చేయాలి.**
- **సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి పిలుపు.**

**సత్తుపల్లి, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు)**: సీపీఎం సత్తుపల్లి డివిజన్ కమిటీ సమావేశం జాజిరి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నికరంగా, ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహిస్తున్న సీపీఎం అభ్యర్థులను రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సత్తుపల్లి, కల్లూరు పట్టణాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్ల సమస్యలు, ఇండ్లు, ఇండ్ల స్థలాల కొరత, పట్టణ అభివృద్ధి ప్రణాళికాబద్ధంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి పారిశ్రామిక రంగ అభివృద్ధి అత్యవసరమని, అలాగే పట్టణ సుందరీకరణ చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. సత్తుపల్లి ఏర్పడిన నాటి నుంచి ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని, పట్టణ అభివృద్ధి జరిగితేనే నియోజకవర్గం మొత్తం అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్న సీపీఎం నుంచి పోటీ చేసే అభ్యర్థులను గెలిపిస్తే మున్సిపల్ కౌన్సిల్‌లో ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతు బలపడుతుందని తెలిపారు.

సీపీఎం కౌన్సిలర్లు గతంలో మున్సిపల్ వేదికగా ప్రజా సమస్యలను ప్రస్తావించి, వాటి పరిష్కారానికి కృషి చేసిన చరిత్ర పార్టీకి ఉందని గుర్తు చేశారు. నీతి, నిజాయితీ, విలువలకు కట్టుబడి పనిచేసే సీపీఎం అభ్యర్థులను ప్రజలు ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, చలమాల విఠలావు, డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు కొలికపోగు సర్వేశ్వరరావు, అయినాల రామలింగేశ్వరరావు, తన్నీరు కృష్ణార్జునరావు, మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, పెనుబల్లి మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, కల్లూరు మండల కార్యదర్శి మాదాల వెంకటేశ్వరావు, వేంసూర్ మండల కార్యదర్శి అరవపల్లి జగన్మోహన్‌రావు, డివిజన్ కమిటీ సభ్యులు నల్లబోతు మోహన్‌రావు, పాకలపాటి ఝాన్సీ, శీలం కరణ్, మిట్టపల్లి నాగమణి, దోమతోట్టి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# అరైవ్ అలైవ్–2026 పై కుషాయిగూడ పోలీస్ స్టేషన్ లో మీడియా ద్వారా అవగాహన







- **ప్రజల ప్రాణాల రక్షణే లక్ష్యం: మల్కాజిగిరి అదనపు డీసీపీ ఎన్. వెంకట రమణ**

**కుషాయిగూడ, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు)**: మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణ భద్రత లక్ష్యంగా రాష్ట్ర పోలీసు శాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్-2026' కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు పోలీసులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు మల్కాజిగిరి అదనపు డీసీపీ ఎన్. వెంకట రమణ తెలిపారు. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఏసీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజలు సురక్షితంగా ప్రయాణించి గమ్యస్థానాలకు చేరుకోవాలనే ఉద్దేశ్యంతో 10 రోజులపాటు 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమం కేవలం అవగాహనకే పరిమితం కాకుండా ప్రజల ప్రవర్తనలో మార్పు తీసుకురావడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.అరైవ్ అలైవ్ 2026 పై కార్యక్రమం ద్వారా అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ట్రాఫిక్ అవగాహన సదస్సులు, ర్యాలీలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు, లీఫ్‌లెట్ల ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం తీసుకువస్తున్నట్లు తెలిపారు. కాలనీలు, ప్రధాన కూడళ్లు, బస్టాండ్‌లు, కమ్యూనిటీ హాళ్లలో ప్రత్యేక అవగాహన సమావేశాలు నిర్వహిస్తూ ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు, కార్ డ్రైవర్లు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాల డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను వివరిస్తున్నామన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, రాంగ్ సైడ్‌లో ప్రయాణించడం, అతివేగం వంటి తప్పిదాల వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సీట్‌బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలనీ, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించాలని సూచించారు. నిబంధనలు పాటించకపోతే ప్రమాదాలతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.రోడ్డు భద్రత నిబంధనలు పాటించకపోవడం వల్ల అనేక కుటుంబాలు తమ ఆప్తులను కోల్పోయి అనాథలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి వాహనదారుడు తన కుటుంబ భద్రతను దృష్టిలో పెట్టుకుని బాధ్యతాయుతంగా వాహనం నడపాలని కోరారు. "మీ కోసం మీ కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్నారు. సురక్షితంగా ఇంటికి చేరడమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ఏసీపీ వై. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు క్షేత్రస్థాయిలో పోలీసులు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుషాయిగూడ సీఐ ఎల్. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించడమే ప్రమాదాల నివారణకు మార్గమని అన్నారు.ఈ విలేకరుల సమావేశంలో ఎస్సైలు సుధాకర్ రెడ్డి, వెంకన్నలతో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అరైవ్ అలైవ్ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లకు అవగాహన







- **సత్తుపల్లి బస్టాండ్‌లో రవాణా నియమాలపై ప్రత్యేక కార్యక్రమం.**
- **ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తామని ఆటో యూనియన్ ప్రతిజ్ఞ.**

**సత్తుపల్లి, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు)**: సత్తుపల్లి టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమం భాగంగా సత్తుపల్లి టౌన్ సీఐ తుమ్మలపల్లి శ్రీహరి బుధవారం సత్తుపల్లి బస్టాండ్‌లో ఆటో యూనియన్ సభ్యులకు రవాణా నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ముఖ్యంగా ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. అధిక వేగం, తప్పు దారుల్లో వాహనాలు నడపడం వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ఇకపై అన్ని రవాణా నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తామని ఆటో యూనియన్ సభ్యుల చేత ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు భద్రతపై ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

# సంక్షేమం, సంస్కరణ, సమైక్యత మన ధ్యేయం

- **ఖమ్మం బార్ అసోసియేషన్ న్యాయవాది దిలీప్ తాళ్లూరి.**






**ఖమ్మం బ్యూరో,జనవరి 21(తెలంగాణ ముచ్చట్లు)**: ఖమ్మం బార్ అసోసియేషన్ న్యాయవాది దిలీప్ తాళ్లూరి ఆర్మూర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమావేశమై, న్యాయవాదుల సంక్షేమం, 41ఎ సిఆర్ పిసి / 35(3) బి.ఎన్.ఎస్.ఎస్ వరణలు, అలాగే పార్లమెంట్ మరియు తెలంగాణ అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లిన ప్రతిపాదనలు వివరించారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ డ్రాఫ్ట్ లో సలహాలు సూచనలు. అలాగే వెల్ఫేర్ ఫండ్, హెల్త్ ఇన్సూరెన్స్, ప్రొటెక్షన్ యాక్ట్ వంటి న్యాయవాదుల హక్కుల అంశాలపై తన నిరంతర కృషిని వివరించారు. సభలో పాల్గొన్న న్యాయవాదులు, ఆయన సేవలను ప్రశంసించారు.
దిలీప్ తాళ్లూరి రాబోయే తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికలలో న్యాయవాదుల హక్కుల కోసం తన పోరాటాన్ని కొనసాగిస్తానని తెలిపారు.

# సత్తుపల్లిలోఎమ్మెల్యే రాగమయి విస్తృత పర్యటన

- **ప్రజా సమస్యలపై ప్రత్యక్ష స్పందన.**
- **సీఎం కప్ క్రీడలకు ఘన ప్రారంభం.**

**సత్తుపల్లి, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు)**: సత్తుపల్లి పట్టణం, మండలంలో బుధవారం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు. సత్తుపల్లి పట్టణం 6వ వార్డులో మాజీ వైస్‌చైర్మన్ తోట సుజలారాణి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. వార్డులోని వివిధ కాలనీల్లో నివసిస్తున్న ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మాధురి ఫంక్షన్ హాల్ సమీపంలోని రహదారి, రాజ బాపయ్య హాస్పిటల్ రోడ్డు ప్రాంతాల్లోని రహదారులు, డ్రైనేజీలు, భవనాలకు ఆనుకుని ఉన్న విద్యుత్ లైన్లను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే చింతలపాటి రోడ్డులో నివసిస్తున్న వంగ శ్రీనును అనారోగ్య కారణంగా పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, అవసరమైన సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం సత్తుపల్లి మండలంలోని కిష్టారం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో కిష్టారం, చెరుకుపల్లి, యాతలకుంట గ్రామాల పాఠశాల క్రీడాకారులతో కలిసి నిర్వహించిన చీఫ్ మినిస్టర్ కప్ క్రీడా పోటీలను ఎమ్మెల్యే రాగమయి ప్రారంభించారు. వాలీబాల్ పోటీలకు టాస్ వేసి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రీడాకారులతో కలిసి కొద్దిసేపు వాలీబాల్ ఆట ఆడారు. అలాగే రుద్రాక్షపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో రుద్రాక్షపల్లి, కాకర్లపల్లి, బుగ్గపాడు, రేగళ్లపాడు గ్రామాల పాఠశాల క్రీడాకారులతో కలిపి నిర్వహించిన చీఫ్ మినిస్టర్ కప్ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కబడ్డీ పోటీలను ప్రారంభించి టాస్ వేసి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ రెండు కార్యక్రమాల్లో మాట్లాడుతూ పల్లెల నుంచే జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు ఎదగాలన్న లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి క్రీడా కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు ఇస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని పేర్కొన్నారు.





తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ఉప్పల్ ఓల్డ్ విలేజ్‌లో రూ.1.25 కోట్లతో సీసీ రోడ్డు పనుల ప్రారంభం





**ఉప్పల్, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ విలేజ్ (భరత్ నగర్) ప్రాంతంలో రూ.1 కోటి 25 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల కాలనీల్లో పర్యటించిన సందర్భంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపడతామని కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఈ అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు.కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి, ఏఈ రాజ్ కుమార్‌తో కలిసి ఓల్డ్ భరత్ నగర్‌లోని మాల్ మైసమ్మ దేవాలయం పరిసరాల్లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అలాగే ఉప్పల్ డివిజన్‌లోని మిగతా ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న ఓపెన్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని ఈ సందర్భంగా కార్పొరేటర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కాయల శీను, లింగంపల్లి రామకృష్ణ, మహంకాళి రాజు, తెలకల మోహన్ రెడ్డి, సల ప్రభాకర్ రెడ్డి, పోగుల సోమ్ రెడ్డి, కాయల చందు, బొరంపేట రాము, బొరంపేట రవి, పండ్ల మల్లేష్, పుల్లల నరేష్, కావలి హరి, పండ్ల లావణ్య, పండ్ల అమరావతి, కావలి రాము, రంగుల శేఖర్, పండ్ల శ్రీకాంత్, శివాజీ, బరంపేట అఖిల్, బన్నీ, పూజారి హనుమంతు తదితరులు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు పకడ్బంది ఏర్పాట్లు

◆ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి : జిల్లా కలెక్టర్ మను చౌదరి





**మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టర్, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కీసరగుట్టలో జరగనున్న శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కీసర రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగువార్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, కూషాయిగూడ ఏసీపీ వెంకట్ రెడ్డి, ఆర్డీఓ రాజేష్, ఆలయ కమిటీ చైర్మన్ తటాకం వెంకటేశ్, ఆలయ ఈవో సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఫిబ్రవరి 15న మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని ఫిబ్రవరి 13 నుంచి 18వ తేదీ వరకు కీసర రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున దర్శన క్యూలైన్లను పెంచి సౌకర్యవంతమైన దర్శన ఏర్పాట్లు చేయాలని సూచించారు.భక్తుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని, భద్రతా పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అత్యవసర వైద్య సేవల కోసం వైద్య సిబ్బంది, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని వైద్య శాఖను సూచించారు.దర్శన క్యూ లైన్లు, బ్యారికేడ్లు, పార్కింగ్ సదుపాయాలను సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. భక్తులకు అవసరమైన అన్ని ప్రాంతాల్లో తాగునీరు అందుబాటులో ఉంచాలని వాటర్ వర్క్స్ శాఖకు సూచించారు. జాతర సమయంలో ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక శానిటేషన్ చర్యలు చేపట్టాలని, అగ్నిప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక సిబ్బంది, ఫైర్ ఇంజిన్‌ను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ తెలిపారు.మహాశివరాత్రి సందర్భంగా కీసరగుట్టలో జరిగే రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ ఈ సమావేశంలో పిలుపునిచ్చారు.ఈ సమీక్ష సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# దొంగతనం చేసిన స్కూటీతోనే ప్రమాదం.!

◆ రూ.4,500 నగదు పోలీసులకు అప్పగింత





**సత్తుపల్లి, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామ సమీపంలో జరిగిన ఘటనలో, సత్తుపల్లి విద్యానగర్‌కు చెందిన కందుకూరి సోమాచారి దొంగతనం చేసిన స్కూటీతో కిష్టారం వద్ద ఢీకొని ప్రమాదానికి గురయ్యాడు. స్కూటీ దొంగతనం కేసులో చింతకాని పోలీస్ స్టేషన్ పరిధిలో మరో కేసులో పరారీలో ఉన్న అతడు, అదే స్కూటీపై ప్రయాణిస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో అతడికి తలకు, కాళ్లకు తీవ్రమైన గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే సత్తుపల్లి 108 అంబులెన్స్ సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ గొల్లమందల కృష్ణ, పైలట్ షేక్ అన్వర్ సంఘటన స్థలానికి చేరుకుని కాలు నుంచి కారుతున్న రక్తస్రావాన్ని అరికట్టారు. అనంతరం క్షతగాత్రుడికి సీ కాలర్ వేసి, సెలైన్ బాటిళ్లు, ఇంజక్షన్లు, స్ప్లి ంటింగ్ చేసి అంబులెన్స్ ద్వారా సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి వద్ద లభించిన రూ.4,500 నగదును అతడిని వెతుకుతూ సంఘటన స్థలానికి వచ్చిన చింతకాని ఎస్ఐకి 108 సిబ్బంది అప్పగించారు. అలాగే అతనికి సంబంధించిన ఏటీఎం కార్డులు, కారు తాళం సహా ఇతర వ్యక్తిగత వస్తువులను అతని అన్న కందుకూరి ఆంజనేయులకు అందజేశారు. నిజాయితీతో విధులు నిర్వర్తించిన సత్తుపల్లి 108 సిబ్బందిని ఖమ్మం జిల్లా 108 సర్వీస్ మేనేజర్ అవులూరి దుర్గాప్రసాద్, మూడు జిల్లాలను నిరంతరం పర్యవేక్షిస్తున్న షేక్ నజీరుద్దీన్, కిష్టారం గ్రామస్తులు మరియు చింతకాని పోలీసు సిబ్బంది అభినందించారు.

# మున్సిపల్ పోరుకు టీఆర్పీ సన్నద్ధం

◆ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా యూత్ అధ్యక్షుడు ఎస్. ఆరుణ్ కుమార్ పటేల్

**మేడ్చల్–మల్కాజిగిరి, జనవరి 21(తెలంగాణ ముచ్చట్లు):** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) పూర్తిగా సిద్ధంగా ఉందని ఆ పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా యూత్ అధ్యక్షుడు ఎస్. ఆరుణ్ కుమార్ పటేల్ తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్ ఆదేశాల ప్రకారం టీఆర్పీ అభ్యర్థులు మూడు చింతలపల్లి, ఎల్లంపేట, అలియాబాద్ మున్సిపాలిటీల్లో బరిలోకి దిగుతున్నట్లు వెల్లడించారు. గ్రామ, మండల స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తున్నామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు టీఆర్పీ తరఫున బీ-ఫారాలు అందజేస్తామని స్పష్టం చేశారు.ప్రశ్నించే గొంతుకగా, బడుగు-బలహీన వర్గాల ఆశాజ్యోతిగా నిలిచిన తీన్మార్ మల్లన్న సామాజిక న్యాయం, బహుజన రాజ్యం లక్ష్యంగా సాగిస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీల రాజ్యం స్థాపన కోసం టీఆర్పీ మరింత బలంగా ముందుకు సాగుతుందని చెప్పారు.రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండాను ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీసీల హక్కుల కోసం పుట్టిన పార్టీ టీఆర్పీ అని, బీసీ అభ్యర్థులను నిలబెట్టి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు ఆలోచించి టీఆర్పీకి పట్టం కట్టాలని ఆయన కోరారు.



## నూతన ఎస్సై జలంధర్ రెడ్డిని సన్మానించిన పెద్దమందడి ప్రెస్ క్లబ్



**పెద్దమందడి,జనవరి21(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పెద్దమందడి పోలీస్ స్టేషన్‌కు నూతనంగా నియమితులైన ఎస్సై జలంధర్ రెడ్డిని ప్రెస్ క్లబ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. పెద్దమందడి మండలంలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజల సమస్యలపై సత్వర స్పందన అందించాలని కోరారు.ముఖ్యంగా అక్రమ కార్యకలాపాల నియంత్రణ, ట్రాఫిక్ నియమాల కఠిన అమలు, మహిళలు మరియు బాలల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ఎస్సై జలంధర్ రెడ్డి మాట్లాడుతూ.. పోలీస్ శాఖ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో కీలకమని, మీడియా మరియు పోలీస్ శాఖల మధ్య సమన్వయం మరింత బలపడాలని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో పెద్దమందడి ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు, అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శులు, ప్రెస్ క్లబ్ సభ్యులతో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొని నూతన ఎస్సైకు శుభాకాంక్షలు తెలిపారు.

## వెల్టూర్‌లో బండ్ల గణేష్ సంకల్ప పాదయాత్రకు ఘన స్వాగతం



**పెద్దమందడి,జనవరి21(తెలంగాణ ముచ్చట్లు):** సినీ నిర్మాత బండ్ల గణేష్ చేపట్టిన సంకల్ప పాదయాత్ర పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామ సమీపానికి చేరుకున్న సందర్భంగా గ్రామ సర్పంచ్ అశోక్, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, దండు నరేష్ ఆయనకు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా వెల్టూర్ గ్రామ సర్పంచ్ అశోక్, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, దండు నరేష్ బండ్ల గణేష్‌ను కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.సంకల్పంతో చేపట్టిన ఈ పాదయాత్ర విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.గతంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టు సమయంలో ఆయన సురక్షిత విడుదల కోసం దేవునికి చేసిన మొక్కును నెరవేర్చడంలో భాగంగానే బండ్ల గణేష్ ఈ సంకల్ప పాదయాత్రను చేపట్టినట్లు ఆయన తెలిపారు. దేవునిపై నమ్మకంతో, సంకల్పబలంతో ప్రారంభించిన ఈ పాదయాత్ర తన వ్యక్తిగత విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.బండ్ల గణేష్ సంకల్పబలంతో చేపట్టిన ఈ పాదయాత్రపై గ్రామ ప్రజలు ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఆయనను చూసేందుకు పెద్ద సంఖ్యలో స్థానికులు తరలివచ్చి మద్దతు తెలిపారు.పాదయాత్ర ద్వారా ప్రజలతో నేరుగా మమేకమవుతూ ముందుకు సాగుతున్నారని పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం




**ఖమ్మం బ్యూరో, జనవరి 22(తెలంగాణ ముచ్చట్లు):** బుధవారం స్థానిక కొణిజర్ల మండలం పెద్ద గోపతి గ్రామం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో కోమట్ల గూడెం గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఇందులో బ్రాంచ్ మేనేజర్ నవీన్ మాట్లాడుతూ అందరూ భీమా చేసుకోవాలని, వాటి ప్రయోజనాలు వివరించారు. ప్రతి ఒక్కరూ బ్యాంక్ వారు కల్పించే సదుపాయాలని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఎలివేటెడ్ కారిడార్ భూసేకరణకు పరిహారం పంపిణీ





◆ బాధిత భూ యజమానులకు నష్ట పరిహారం అందజేసిన జిల్లా కలెక్టర్ మను చౌదరి

**మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ నుంచి షామీర్‌పేట వరకు 18 కిలోమీటర్ల పొడవునా నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు కోసం చేపట్టిన భూసేకరణ ప్రక్రియలో భాగంగా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రభావితమైన భూ యజమానులకు పునరావాసం & పునరావాస హక్కుల చట్టానికి అనుగుణంగా నష్ట పరిహారం అందజేశారు.ఈ ఎలివేటెడ్ కారిడార్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అల్వాల్ మండలంలో 1.5 కిలోమీటర్లు, షామీర్‌పేట మండలంలో 4.0 కిలోమీటర్లు, మొత్తం 5.0 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. రాష్ట్ర ప్రాధాన్యత కలిగిన ఈ ప్రాజెక్టు కోసం జిల్లా యంత్రాంగం భూసేకరణ ప్రక్రియను ప్రారంభించింది.2017లో సవరించిన 2013 భూసేకరణ చట్టం ప్రకారం యు/ఎస్ 11(2) కింద జారీ చేసిన ప్రాథమిక నోటిఫికేషన్ మేరకు, తెలంగాణ గెజిట్ నెం. యంయండి06, 07, 08, 09 & 10 (తేదీ: 24.10.2024) ద్వారా హకీంపేట, దేవర్యాంజల్, లోతుకుంట, తూముకుంట, అల్వాల్ మరియు పోతైపల్లి గ్రామాలకు చెందిన భూ యజమానులందరికీ ఎస్ఈఎస్ సర్వే నిర్వహించి, పునరావాసం & పునరావాస హక్కులకు అనుగుణంగా పరిహారం ఖరారు చేశారు. భూ యజమానులతో వరుస చర్చల అనంతరం, జిల్లా కలెక్టర్ మను చౌదరి నేతృత్వంలోని జిల్లా స్థాయి చర్చల కమిటీ చదరపు గజానికి రూ. 90,000/ పరిహారాన్ని ఖరారు చేసింది. ఈ మేరకు 2017 చట్టం యు/ఎస్ 30ఏ & 31ఏ ప్రకారం స్వచ్ఛంద సముపార్జన అమ్మకపు ఆర్డర్‌ను ,ఎస్‌డిసి, ఎల్ఏ (పరిశ్రమలు), హైదరాబాద్ వారు 21.01.2026న ఆమోదించారు.అదే తేదీన పోతైపల్లి గ్రామంలోని సర్వే నెం. 96కు చెందిన 784 చదరపు గజాల భూభాగానికి సంబంధించి ముగ్గురు భూ యజమానులకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి నష్ట పరిహారం అందజేశారు. అనంతరం సేకరించిన భూమిని హెచ్ఎండిఏ ప్రతినిధులకు అప్పగించనున్నారు.

# ఓటరు జాబితా మ్యాపింగ్ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలి





◆ అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

**మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా 2002 నుంచి ఉన్న ఓటరు జాబితాను 2025 ఓటరు జాబితాకు అనుగుణంగా మ్యాపింగ్ ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశించారు. తక్కువ శాతం నమోదైన నియోజకవర్గాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన సూచించారు. బుధవారం కీసర తహాసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా అనుసంధాన (మ్యాపింగ్) ప్రక్రియ పురోగతిపై అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో మ్యాపింగ్ శాతం తక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో ఎఈఆర్ఓలు పూర్తి బాధ్యతతో పనిచేసి ఈ నెలాఖరులోగా ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు.బీఎల్ఓలకు రోజువారీ లక్ష్యాలు కేటాయించి మ్యాపింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. మ్యాపింగ్ నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన సూచనలు, సలహాలు అందించారు.ఈ సమావేశంలో కీసర ఆర్డీఓ రాజేష్, కీసర తహాసీల్దారు యాదగిరి, శామీర్‌పేట్ తహాసీల్దారు సుచరిత, ఘట్కేసర్ తహాసీల్దారు చంద్రశేఖర్, మేడిపల్లి తహాసీల్దారు కృష్ణ చైతన్య, మేడ్చల్ తహాసీల్దారు భూపాల్, ఎంసీ పల్లి డీటీ సునీల్, మున్సిపల్ కమిషనర్లు, సూపర్వైజర్లు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.



# నవీన్ గౌడ్ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో బుక్కుల పంపిణీ

**కాప్రా, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):** కాప్రా డివిజన్ అధ్యక్షులు బైరి నవీన్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బుక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందజేసి, చదువుతోనే మంచి భవిష్యత్తు నిర్మించుకోవచ్చని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తున్న నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యతో పాటు సామాజిక బాధ్యతను కూడా విద్యార్థులు అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పల్లెపాటి శివలింగం, దుంపల నాగరాజు, మాజీ కౌన్సిలర్ ఎం. బాలమ్మ, ఎన్. ప్రవీణ్, ఎన్. బాలు, జి. దుర్గయ్య, డి. యాదగిరి, ఎం. నవీన్, జి. శివకుమార్, బి. శివకుమార్ తదితరులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.



# టాటా ఎలక్ట్రానిక్స్‌లో సాయిస్ఫూర్తి విద్యార్థులకు ఉద్యోగాలు

- ప్రొడక్షన్ ట్రైనీ ఇంజనీర్ పోస్టులకు 53 మంది ఎంపిక.

**సత్తుపల్లి, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక మండల పరిధిలోని బి గంగారం గ్రామం సాయిస్ఫూర్తి ఆటానమస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభను మరోసారి నిరూపించారు. టాటా గ్రూప్‌కు చెందిన ప్రముఖ సంస్థ టాటా ఎలక్ట్రానిక్స్ నిర్వహించిన రిక్రూట్మెంట్ డ్రైవ్‌లో కళాశాలకు చెందిన 53 మంది విద్యార్థినీ, విద్యార్థులు ప్రొడక్షన్ ట్రైనీ ఇంజనీర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

ఎంపికైన వారిలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ నుంచి 12 మంది, కంప్యూటర్ సైన్స్ & మెషిన్ లెర్నింగ్ నుంచి 11 మంది, ఏఐ & ఎంఎల్, ఏఐ & డీఎస్ విభాగాల నుంచి 18 మంది, ఈసీఈ నుంచి 4 మంది, ఈఈఈ నుంచి 8 మంది ఉన్నట్లు కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ వి. కృష్ణారెడ్డి తెలిపారు. టాటా ఎలక్ట్రానిక్స్ జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ ఎంపిక ప్రక్రియకు కళాశాల నుంచి 92 మంది విద్యార్థులు హాజరు కాగా, రాత పరీక్ష, టెక్నికల్, హెచ్ఆర్ మరియు మౌఖిక ఇంటర్వ్యూల ద్వారా తుది ఎంపిక జరిగినట్లు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు.

కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, జాతీయ స్థాయి ఎంపికల్లో తమ విద్యార్థులు నిలకడగా విజయాలు సాధించడం గర్వకారణమన్నారు. విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు, వినూత్న ఆలోచనలే ఈ విజయానికి కారణమని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు చివరి సంవత్సరం పూర్తి చేసిన వెంటనే విధుల్లో చేరనున్నట్లు, చెన్నై, హైదరాబాద్ కేంద్రాల్లో ఉద్యోగాలు లభించనున్నట్లు తెలిపారు. వీరికి సంవత్సరానికి రూ.2.4 లక్షల వేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కళాశాల చైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త, హెటిరో ఫార్మాస్యూటికల్స్ అధినేత, రాజ్యసభ సభ్యులు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద వర్చువల్‌గా విద్యార్థులను అభినందించారు.

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ, పరిశ్రమలతో అవగాహన ఒప్పందాల ద్వారా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు, ఇండస్ట్రియల్ టూర్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని ఇంజనీరింగ్ విభాగాధిపతులు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులు, అధ్యాపకులు పాల్గొని ఎంపికైన విద్యార్థులను అభినందించారు.






# రోడ్డు భద్రతకు పకడ్బందీ చర్యలు..



## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో, జనవరి - 21(తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని, విద్యాసంస్థలు రవాణా నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్ నందు రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా చేపడుతున్న చర్యలపై రవాణా శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా, జాతీయ రోడ్డు భద్రతా మాసం-2026లో భాగంగా, రవాణా శాఖ హన్మకొండ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ జి. సురేష్ రెడ్డి, రవాణా శాఖ కమిషనరేట్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ అఫ్రిన్ సిద్ధిఖీ లు కలెక్టర్ కు రోడ్డు భద్రతా కార్యక్రమాలపై వివరాలు కలెక్టర్ కు సమర్పించారు. ఇటీవల పెనుబల్లిలో జరిగిన పాఠశాల బస్సు ప్రమాదం నేపథ్యంలో, జిల్లాలోని అన్ని విద్యాసంస్థల బస్సులు తప్పనిసరిగా రీ-ఇన్‌స్పెక్షన్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మొత్తం 764 విద్యాసంస్థల బస్సుల రీ-ఇన్‌స్పెక్షన్ చేపట్టామని, సత్తుపల్లి యూనిట్ కార్యాలయం పరిధిలో 153 బస్సులకు గాను 146 బస్సుల రీ-ఇన్‌స్పెక్షన్ పూర్తి చేశామని, వైరా యూనిట్ కార్యాలయం పరిధిలో 135 బస్సుల్లో 133 బస్సుల తనిఖీలు పూర్తి కాగా, ఒక బస్సు మరమ్మతుల కారణంగా పెండింగ్‌లో ఉందని తెలిపారు. ఖమ్మం పరిధిలో 484 బస్సుల్లో 320 బస్సుల రీ-ఇన్‌స్పెక్షన్ పూర్తయినట్లు, మిగిలిన 120 బస్సుల పరిశీలనను త్వరలో పూర్తిచేయనున్నట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. కొన్ని బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోవడం, ఇంజిన్ సమస్యలు, వాహన వినియోగంలో లేనివిగా గుర్తించడంతో సంబంధిత యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా *జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ* పిల్లల ప్రాణ భద్రత అత్యంత ముఖ్యమైనది, విద్యాసంస్థల బస్సులు రోడ్డు భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రవాణా శాఖ ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లను కొనసాగిస్తూ, రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇటీవల జరిగిన పాఠశాల బస్సు ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని, ఖమ్మం జిల్లాలోని అన్ని విద్యాసంస్థల బస్సులపై ప్రత్యేక రీ-ఇన్‌స్పెక్షన్ చేపట్టామని అన్నారు. లోపాలు గుర్తించిన వాహన యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి, లోపాలు సరిచేసే వరకు బస్సులను అనుమతించమని తెలిపారు.

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, విద్యాసంస్థల యాజమాన్యాలు, డ్రైవర్లు, తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రోడ్డు భద్రత విషయంలో జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ చేస్తూ, ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లను కొనసాగిస్తుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆకస్మిక తనిఖీలు చేపట్టి, నిబంధనల ఉల్లంఘనలకు కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి జగదీష్, మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్, అధికారులు, తదితరులు వున్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ప్రపంచ వారసత్వ కట్టడమైన తాజ్‌మహల్‌కు సీఐఎస్ఎఫ్ కట్టుదిట్ట భద్రత



- **లక్షలాది పర్యాటకులకు సురక్షిత సందర్శన**
- **భారత సాంస్కృతిక వారసత్వానికి రక్షణ కవచం**

**ఆగ్రా, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రపంచ అద్భుతాల్లో ఒకటైన తాజ్‌మహల్‌ను సురక్షితంగా కాపాడుతూ, దేశ విదేశాల నుంచి వచ్చే లక్షలాది పర్యాటకులకు భద్రతతో కూడిన సందర్శన అనుభూతిని అందించడంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం కీలక పాత్ర పోషిస్తోంది.

ప్రేమకు ప్రతీకగా నిలిచిన ఈ చారిత్రక కట్టడాన్ని అన్ని విధాలా రక్షిస్తూ సీఐఎస్ఎఫ్ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తోంది. అత్యున్నత స్థాయి అప్రమత్తత, వృత్తిపరమైన నైపుణ్యం, అంకితభావంతో సీఐఎస్ఎఫ్ సిబ్బంది తాజ్‌మహల్ పరిసరాలను పర్యవేక్షిస్తున్నారు. ఆధునిక భద్రతా పద్ధతులు, నిరంతర గస్తీ, పర్యాటకులకు సహకారం అందిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

భారతదేశానికి గర్వకారణమైన తాజ్‌మహల్ వంటి ప్రపంచ వారసత్వ కట్టడాన్ని కాపాడడం కేవలం భద్రతకే పరిమితం కాదని, అది దేశ సాంస్కృతిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించడమేనని సీఐఎస్ఎఫ్ అధికారులు పేర్కొన్నారు. ప్రతి రోజు వేలాది మంది సందర్శించే ఈ కట్టడంలో భద్రతా వ్యవస్థలు నిరంతరం సమీక్షించబడుతున్నాయి. దేశం ముందు అన్న భావనతో విధులు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది కృషి వల్లనే తాజ్‌మహల్ ప్రపంచ పర్యాటకులకు సురక్షితంగా దర్శనమిస్తోంది. భారత వారసత్వానికి రక్షణ కవచంగా నిలుస్తున్న సీఐఎస్ఎఫ్ సేవలు దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నాయి.



# రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన స్పెయిన్ విదేశాంగ మంత్రి

- **ఇండియా–స్పెయిన్ ద్వైవార్షికోత్సవంపై సంతోషం వ్యక్తం**
- **సంస్కృతి, పర్యాటకం, ఏఐలో సహకారానికి కొత్త ఊపిరి**

**న్యూఢిల్లీ, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):**



స్పెయిన్ విదేశాంగ, యూరోపియన్ యూనియన్ మరియు సహకార మంత్రి జోస్ మాన్యువెల్ ఆల్బారెస్ రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇండియా-స్పెయిన్ సంబంధాలపై విస్తృతంగా చర్చ జరిగింది.

భారత్-స్పెయిన్ మధ్య ప్రారంభమైన 'డ్యుయల్ ఇయర్ ఆఫ్ కల్చర్, టూరిజం అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' కార్యక్రమంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతోషం వ్యక్తం చేశారు. ఈ ద్వైవార్షికోత్సవం ద్వారా రెండు దేశాల మధ్య ఉన్న బలమైన సాంస్కృతిక బంధాలు, ప్రజల మధ్య అనుబంధం మరింత బలపడతాయని ఆమె పేర్కొన్నారు.

పర్యాటక రంగంలో కొత్త అవకాశాలు తెరుచుకోనున్నాయని, అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహా సాంకేతిక రంగాల్లో సహకారం మరింత లోతుగా విస్తరించనుందని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. ఇండియా-స్పెయిన్ భాగస్వామ్యం భవిష్యత్‌లో మరింత బలోపేతం అవుతుందన్న విశ్వాసాన్ని ఆమె వ్యక్తం చేశారు.

ఈ భేటీతో రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు కొత్త దశలోకి ప్రవేశిస్తున్నాయని దౌత్య వర్గాలు పేర్కొన్నాయి.




# ధర్మపురిలో అభివృద్ధి పనులకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

ధర్మపురి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు భూమి పూజ నిర్వహించినట్లు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, వసతులు కల్పించే లక్ష్యంతో ఒక్కో స్కూల్‌ను సుమారు 25 ఎకరాల్లో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో తొలి ఏడాదిలోనే 100 స్కూల్‌లకు అనుమతులు ఇచ్చామని, మొత్తం రూ.22,500 కోట్లతో ప్రణాళికలు రూపొందించి మొదటి దశలో రూ.11,500 కోట్ల విలువైన పనులకు శాంక్షన్ ఇచ్చినట్లు వెల్లడించారు.





మన బిడ్డల భవిష్యత్తే తెలంగాణ భవిష్యత్తు అని పేర్కొన్న ఉప ముఖ్యమంత్రి, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదివి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనులు వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి నెల బిల్లులు మంజూరు చేయడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిరుపేదలకు గౌరవప్రదమైన జీవితం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. తొలి ఏడాదిలోనే 4.50 లక్షల ఇండ్లకు అనుమతులు ఇచ్చామని, మహిళలను మహాలక్ష్మిలా గౌరవిస్తూ ఇందిరమ్మ చీరలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణ రావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాగూర్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి టెండర్లలో కోట్ల బొగ్గు కుంభకోణం

**రామగిరి, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు)::**

సింగరేణి టెండర్లలో 'సైట్ విజిట్' నిబంధనను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం కోట్ల రూపాయల బొగ్గు కుంభకోణానికి పాల్పడిందని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపించాయి. ప్రజాధనాన్ని పందికొక్కుల్లా మేస్తూ సింగరేణిని కొల్లగొడుతున్న కాంగ్రెస్ నేతల అవినీతిని ఎండగడుతూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో రామగిరి మండలం సెంటనరీ కాలనీ ఆర్‌జి-3 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మాట్లాడుతూ, టెండర్ల ప్రక్రియలో నిబంధనల పేరుతో అక్రమాలకు తావిచ్చారని విమర్శించారు. సింగరేణి లాభాలను కొద్ది మంది స్వార్థ ప్రయోజనాల కోసం దోచుకుంటున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకుడు మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ, కార్మికుల హక్కులు, సంస్థ ప్రయోజనాలు పక్కనపెట్టి అవినీతికి తలుపులు తెరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి ప్రతిష్ఠను కాపాడేందుకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.




ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సింగరేణిలో అవినీతి ఆరోపణలపై ప్రభుత్వ స్పందన రావాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# ముచ్చర్ల సత్యనారాయణ జయంతి సందర్భంగా నివాళులు

**హైదరాబాద్, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ మంత్రి ముచ్చర్ల సత్యనారాయణ జయంతిని పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొని ముచ్చర్ల సత్యనారాయణ సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ సాధన కోసం ఆయన చేసిన త్యాగాలు, ఉద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్రను ఆమె గుర్తు చేశారు.

తెలంగాణ ఉద్యమంలో ముచ్చర్ల సత్యనారాయణ చూపిన దార్శనికత, ప్రజాసేవ పట్ల ఉన్న నిబద్ధత తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని జాగృతి నేతలు తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ తెలంగాణ సమాజం కోసం పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. ఈ నివాళుల కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొని ముచ్చర్ల సత్యనారాయణకు ఘనంగా నివాళులర్పించారు.




# టోల్ ఎగవేస్తే ఇక తప్పించుకోలేరు.. సర్టిఫికెట్లు బ్లాక్.. జీవితాంతం ఇబ్బందులే..!!

**హైదరాబాద్ – 21 జనవరి 2026 – డిజైనర్ టెక్ గురు ప్రతినిధి**

జాతీయ రహదారులపై టోల్ చెల్లించకుండా వెళ్లే వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. టోల్ బకాయిలు చెల్లించని వాహనాలపై కఠిన చర్యలు తీసుకునేలా కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చింది. ఈ మార్గదర్శకాల ప్రకారం ఇక నుంచి టోల్ ఫీజు పెండింగ్‌లో ఉంటే అనేక ప్రభుత్వ సేవలు నిలిచిపోతాయి. వాహన యజమానులు తప్పనిసరిగా టోల్ బకాయిలు పూర్తిగా చెల్లించిన తర్వాతే తదుపరి సేవలు పొందే అవకాశం ఉంటుంది.

కొత్త నిబంధనల ప్రకారం టోల్ బకాయిలు ఉన్న వాహనాలకు నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ జారీ చేయరు. ఫిట్‌నెస్ సర్టిఫికేట్ రిన్యూవల్ కూడా నిలిపివేస్తారు. అలాగే జాతీయ పర్మిట్ వంటి కీలక అనుమతులు కూడా ఇవ్వరు. ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వాహన యాజమాన్యాన్ని మార్చుకోవాలంటే ముందుగా టోల్ బకాయిలు పూర్తిగా చెల్లించాల్సిందే. టోల్ చెల్లించకుండా వాహనం దాటితే ఆ వాహనాన్ని చెల్లించని వినియోగదారుడిగా పరిగణిస్తారు. ఈ వివరాలను దరఖాస్తు ఫారంలో తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది.




టోల్ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయడమే లక్ష్యంగా ఈ మార్పులు తీసుకొచ్చినట్లు కేంద్రం స్పష్టం చేసింది. త్వరలో దేశవ్యాప్తంగా వాహనాలు ఆగకుండా టోల్ వసూలు చేసే మల్టీలేన్ ఫ్రీ టోల్ విధానాన్ని కూడా అమల్లోకి తీసుకురానున్నారు. ప్రస్తుతం కొన్ని హైవేలపై పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేస్తుండగా, దశలవారీగా అన్ని ప్రాంతాలకు విస్తరించనున్నారు.

టోల్ బకాయిలు నిర్లక్ష్యం చేస్తే ఇకపై వాహనదారులు ప్రభుత్వ సేవలు పొందలేని పరిస్థితి ఎదురవుతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అందుకే వాహన యజమానులు టోల్ చెల్లింపుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

# రిపబ్లిక్ డే పరేడ్‌లో చరిత్ర సృష్టించనున్న మహిళా అధికారి



- **కార్తవ్య పథ్‌పై ఆల్-మెన్ సీఆర్పీఎఫ్ బృందానికి నాయకత్వం**
- **జమ్మూ కాశ్మీర్‌కు గర్వకారణంగా సిమ్రన్ బాల**

న్యూఢిల్లీ, జనవరి 21 (తెలంగాణ ముచ్చట్లు):
రిపబ్లిక్ డే పరేడ్‌లో భారత భద్రతా దళాల చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించేందుకు జమ్మూ కాశ్మీర్‌కు చెందిన 26 ఏళ్ల మహిళా అధికారి సిద్ధమయ్యారు. జమ్మూ కాశ్మీర్‌లోని రాజౌరీ జిల్లా నౌషెరాకు చెందిన సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సిమ్రన్ బాల జనవరి 26, 2026న న్యూఢిల్లీలోని కార్తవ్య పథ్‌పై జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పూర్తిగా పురుషులతో కూడిన సీఆర్పీఎఫ్ మార్చింగ్ కాంటింజెంట్‌కు నాయకత్వం వహించనున్నారు.

ఇది జాతీయ స్థాయి రిపబ్లిక్ డే పరేడ్‌లో 140 మందికి పైగా పురుష సిబ్బందితో కూడిన బృందాన్ని ఒక మహిళా అధికారి కమాండ్ చేయడం ఇదే తొలిసారి. ఈ చారిత్రక ఘట్టం భారత భద్రతా దళాల్లో లింగ సమానత్వం, ప్రతిభకు లభిస్తున్న గుర్తింపుకు నిదర్శనంగా నిలవనుంది.

సిమ్రన్ బాల యూపీఎస్సీ నిర్వహించే కేంద్ర సాయుధ పోలీస్ బలగాల పరీక్షను ఉత్తీర్ణత సాధించి, తన జిల్లాలో నుంచే సీఆర్పీఎఫ్ అధికార హోదాకు చేరిన తొలి మహిళగా గుర్తింపు పొందారు. సీఆర్పీఎఫ్ అకాడమీలో కఠిన శిక్షణ పొందిన ఆమె, ఆపరేషన్ విధుల్లోనూ, క్లిష్ట ప్రాంతాల్లోనూ సేవలందించారు.

ఆమె నియామకం భారత భద్రతా దళాల్లో మహిళలకు పెరుగుతున్న అవకాశాలను, ప్రతిభ ఆధారంగా నాయకత్వ స్థానాలకు ఎదుగుతున్న దృక్పథాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. రిపబ్లిక్ డే పరేడ్‌లో సిమ్రన్ బాల నాయకత్వం యువతకు, ముఖ్యంగా యువ మహిళలకు స్ఫూర్తిదాయకంగా మారనుందని భద్రతా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in